# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 24

**సూర్యోదయం కాకమునుపే నిద్ర లేచి పెరటి వైపుగా వెళ్ళింది నేహల.** ఆకాశంలో చంద్రబింబం తెల్లని కాంతులు విరజిమ్ముతూ ఉంది. క్రితం రాత్రి పౌర్ణమి. సాధారణంగా పౌర్ణమి నాడు తను అశ్వత్థ నారాయణ స్వామి గుడికి వెళ్ళేది. తనూ, రేవన్నా ఖచ్చితంగా కలుసుకునే వారు. కానీ ఇప్పుడు రేవన్న కూడా దగ్గరే ఉన్నాడు. అయినా ఆ ఊసే తట్టడం లేదు. ఎంతో ఆనందంగా, స్వేచ్ఛగా బ్రతికిన తను ఇప్పుడిలా బిక్కు బిక్కు మంటూ గడపాల్సి వస్తోంది. గత నాలుగు నెలలుగా కంటినిండా నిద్రా, కడుపునిండా భోజనం తిన్న దినాలు లేవు. అనుక్షణం భయంతో కాలం వెళ్ళ బుచ్చడమే!

ఒక్కసారి ఆలోచన్ల వెల్లువ ఆవరించింది నేహలని.

నూతి గట్టుకానుకొని కూర్చుంది. చంద్రుడి నీడ నీళ్ళల్లో పడి మెరుస్తోంది. పుట్టిన తరువాత తానెన్నడూ కష్టం అనేదే తెలియ కుండా పెరిగింది. ఏనాడు కంటనీరు పెట్టిన క్షణం లేదు. అలాంటిది మనస్థిమితం లేకుండా పోయిందిప్పుడు. తనే కాదు, తల్లీ, తండ్రీ కూడా ఇంతగా దిగులు చెంది చూళ్ళేదు. ఎప్పుడు ముద్గల్ వెళదామాని మనసు ఉవ్విళ్ళూరుతోంది. తెల్లారేక వెనక్కి వెళిపోదామని రేవన్నకీ, తండ్రికీ చెబుదామాని అనుకుంది. కష్టమో, నష్టమో ముద్గల్లోనే గడుపుదాం. అంతగా దేవరాయలు మనుషులు వెంబడిస్తే చూసుకోవచ్చు. రేవన్నతో పెళ్ళి జరిగితే దేవరాయలు తన జోలికి రాడు కదా అని అనుకుంది.

కానీ రాజులకి ఇవేం పట్టవు. వాళ్ళు అనుకున్నది సాధించాలి. తనని పొందడంకోసం సైన్యమే పంపాడు. గురువుగారి హత్యకూ కారణమయ్యాడు. ముద్గల్ గ్రామం యావతూ అతలాకుతలం చేసాడు. ఇప్పుడు రేవన్నతో పెళ్ళయ్యిందని తెలిస్తే అతన్నీ, అతని తల్లితండ్రులనీ వదిలి పెట్టరు. శంభుడి తల్లితండ్రులనీ ఎంత కూరంగా హింసించారో శంభుడూ చెప్పాడు. రేవన్నతో పెళ్ళి మాటెలా వున్నా తను మాత్రం ముద్గల్ వెనక్కి వెళిపోదామనే చెబుదామని నిశ్చయించుకుంది.

దూరంగా కోడి కూత వినిపిస్తోంది. పక్షుల కిలకిలా రావాలు చుట్టూ వినిపిస్తున్నాయి. మెల్లగా వెలుతురు వస్తోంది. అప్పుడే నిద్ర లేచి కాలకృత్యాలు చేసుకోవడానికి పెరటి వైపుగా వచ్చిన రేవన్న నూతి ఒర మీద కూర్చున్న నేహలని చూసి ఈ వేళ్ళ అక్కడేం చేస్తోందాని ఒక్కసారి ఆశ్చర్యపోయాడు. ఒక మనిషి వస్తున్న చప్పుడు విని తల తిప్పి చూసింది నేహల. కళ్ళు నులుముకుంటూ రేవన్న దగ్గరగా వచ్చాడు.

"ఈ తెల్లవారకట్ల ఇక్కడేం చేస్తున్నావు?" ప్రశ్నించాడు.

ఏమీ లేదన్నట్లు తలూపింది నేహల.

"నిద్ర పట్ట లేదా?" మరో ప్రశ్న వేసాడు. అవునన్నట్లు తలూపింది.

" మనం ముద్గల్ వెళిపోదాం రేవన్నా? ఇలా అజ్ఞాతంగా బ్రతకడం నా వల్ల కాదు. నా వల్ల అప్పాకీ, అమ్మకీ కూడా సుఖ శాంతుల్లేవు." ఆమె కంటి నుండి కన్నీటి చుక్కలు టపటపా రాలడం గమనించాడు రేవన్న.

అతనికీ అంతా తెలుసు. తనక్కూడా ఇలా చాటుగా బ్రతకడం కష్టంగానే ఉంది. అయినా తప్పదు.

"ఇంకెంత? ఓ రెండు వారాలు ఓపిక పట్టు. అన్నీ అవే సర్దుకుంటాయి. యుద్ధమేమీ జరగలేదు కానీ, సంధి చేసుకున్నారనీ మసూం చెప్పాడు. రేపో ఎల్లుండో ఫిరోజ్‌షా సుల్తాన్ గుల్బర్గా వెనక్కి వస్తునారనీ విన్నాను. ఇలాంటి పరిస్థితుల్లో దేవరాయలు నీ వెంట పడి వేధిస్తాడని నేను అనుకోవడం లేదు. కాబట్టి..." మెల్లగా చెప్పాడు.

నేహాలకి అతని మాటలు కొత్త కావు. ఎప్పుడు ముద్గల్ వెళిపోదామన్నా ఓపిక పట్టమనే చెబుతాడు తప్ప మరొక మార్గం -ఆలోచించడు.

అతని మాటలకి ఏమీ సమాధానం చెప్పకుండా మౌనంగా చంద్రుడి కేసి చూస్తూ ఉండి పోయింది. నేహాల కేసే చూస్తూ ఉండిపోయాడు రేవన్న.

ఆమె మొహంలో మునపటి సంతోషమూ, కాంతీ లేవు. కళ్ళకింద నల్ల చారికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇన్నాళ్ళు తన సమీపంలోనే నేహాల ఉన్నా ఎప్పుడూ ప్రేమ విషయమే స్ఫురించలేదు. అతనికీ అశ్వత్థ నారాయణ స్వామి గుడి వెనుక కోనేరు గట్టు మీద కలవడం గుర్తొచ్చింది. క్రమం తప్పకుండా కలిసే వారు. ఇప్పుడు నేహాలా వుంది. తనూ ఉన్నాడు. ఇద్దరి మధ్య వెన్నెలా వుంది. అయినా అప్పటి ఉత్సాహం, ఉద్వేగం ఇప్పుడు లేవు. తలుచుకుంటే ఒక పక్క బాధా, మరొక పక్క నవ్వూ వచ్చాయతనికి.

నేహాల చేతి గాజులు సవరించుకుంటూ చంద్రుడి కేసే చూస్తోంది. వెన్నెల కాంతి పడి ఆమె చేతి గాజులు తళతళా మెరుస్తున్నాయి. గాజుల చివరన పద్మా కారంలో ఉన్న తాయిత్తూ అతను గమనించాడు. ఆ తాయెత్తు తను విరూపాక్ష దేవాలయం దగ్గర కొనడం గుర్తుకొచ్చింది. అక్కడ దుకాణం వాడు "సావిరహే తవదీనా" అష్టపది వస్త్రం మీద రాయడం గుర్తుకొచ్చింది. వెళుతూండగా తన ప్రేమ గురించి తెలుసుకున్న దుకాణదారుడే ఆ తాయెత్తిచ్చాడు. తను అర్థరాత్రి నేహాల ఇంటికెళ్ళి ఆమె చేతికి కట్టడం గుర్తొచ్చింది. ఉద్వేగంతో ఒక్క నేహాల చెయ్యి పట్టుకున్నాడు రేవన్న.

ఒక్కసారి ఉలిక్కిపడింది నేహాల. ఆమె కంగారు చూసి చెయ్యి వదిలేసాడు రేవన్న.

" తాయత్తు చూసి మనం మీ ఇంట్లో రాత్రి..." అతనికి మాటలు పెగల్లేదు. ఆమె మరోసారి ఆ తాయత్తు కేసి చూసింది.

"ఇది వచ్చినప్పటినుండే మన కష్టాలు మొదలయ్యాయి రేవన్నా! దీన్ని తెంపి పారేస్తాను.." అంటూ తాయెత్తు తాడుని గట్టిగా లాగపోయింది.

అతను వద్దన్నట్లుగా ఆమె చెయ్యిమీద చేయి వేసి వారించాడు.

"అలా ఎందుకనుకోవాలి? ఆ తాయెత్తే నీకు రక్షగా ఉండి నిన్ను కాపాడుతోందని అనుకోవచ్చు కదా? చూడు, ఇప్పుడిలా ఇన్నాళ్ళూ మనం కలిసి ఉండడం కూడా దానివల్లే కదా?"

"అవును. కలిసిఉంటున్నాం. నా యెదుట నువ్వున్నావు. నీ ఎదుట నేనున్నాను. వెన్నెలా ఉంది. కాలమూ ఉంది. పక్కనే అమ్మా,నాన్నా ఉన్నారు. కానీ సంతోషమే లేదు," కోపంగా అంది నేహాల. రేవన్న మారు మాట్లడ లేదు.

"కాస్త ఓపిక పట్టు నేహాలా!" కొంత సేపాగి అన్నాడు.

"నా ఓపికకే ఓపిక నశిస్తోంది రేవన్నా," నిరాశగా అంది.

"మసూం గుల్బర్గా వెళ్ళాడు. ఇవాళ వస్తాడనుకుంటాను. అతనొచ్చాక, ముద్గల్ వెళ్ళాలన్న ప్రతిపాదన చెబుతాను. అతనూ సరే నంటే వెళిపోదాం," నేహాల చేతిలో చేయి వేస్తూ అన్నాడు.

సరే నన్నట్లు తలూపింది నేహాల.

"నాదొక చిన్న.." అంటూ ఆగిపోయాడు. ఏవిటన్నట్లు చూసింది.

" పద్మం తాయత్తు మన ప్రేమ చిహ్నం. దాన్ని తొలగించేది మన వివాహం నాడే! అంతవరకూ, దయచేసి తీయొద్దు," నెమ్మదిగా అర్థించాడు. అలాగే నన్నట్లు తలాడించింది నేహల.

రేవన్న పెరటివైపుగా వెళ్ళాడు. మెల్లగా లోపలికి నడిచింది నేహల.

ఆ నాడు మధ్యాన్నం మసూం వచాడు. అతను రాక ముందే ఉదయం శంభుడు వచ్చాడు. ముద్గల్లో సైన్యం ఇంకా ఉందనీ చెప్పాడు.

దేవరాయలు ఫిరోజ్‌షా బందీగా చిక్కాడనీ, అక్కడ నుండి విముక్తుడు కావడానికి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేసాడాన్న వార్త మోసుకొచ్చాడు.

"మాకు విషయాలేమీ తెలీవు. సుల్తాన్ సైన్యం మొత్తం రాయచూరులో మకాం వేసుండడంతో నేనూ బయటకు కదల్లేదు. ఏవైనా విషయాలుంటే మసూం ద్వారానే తెలుస్తాయి. అవి కూడా గుల్బర్గా వైపు నుండే కానీ, విజయనగరం గురించి, ముఖ్యంగా ముద్గల్ విషయాలు అస్సలు తెలీవు," శంభుడు చెప్పినవి విని రేవన్న అన్నాడు.

దేవరాయలు బందీ అవ్వడం, కూతుర్ని సుల్తాన్ కిచ్చి పెళ్ళి చెయ్యడం ఇవన్నీ ఆశ్చర్యం కలిగించాయి నేహలకి.

"శత్రు రాజు చిక్కితే చంపకుండా ఎలా వున్నారు?" నేహలకి అనుమానమొచ్చింది.

"అదే మాకూ అర్థం కాలేదు. బహుశా మన సైన్యం వాళ్ళని చుట్టుముట్టి ఉండచ్చు. అయినా ఈ రాజకీయాలు ఎలా మలుపు తిరుగుతాయో అస్సలు చెప్పలేం. పైగా ఇది రాజ్యాలతో వ్యవహారం కూడాను," శంభుడు అన్నాడు. దేవరాయ శర్మ భార్య మెల్లగ కోలుకుంటూందనీ, తనూ, ప్రభా మిగతా శిష్యులందరమూ సహాయం చేస్తున్నామనీ చెపాడు. నేహలా వాళ్ళింటికి తాళం సైన్యం వేసేరనీ, అక్కడ ఇంకా ముగ్గురు సైనికులు కాపలా ఉన్నారనీ చెప్పాడు.

"ఒక పక్క దేవరాయలు బందీ అంటున్నావు. మా ఇంటి వద్ద సైనికుల్ని కాపాలా పెట్టమని ఎవరు చెప్పారు మరి? రాజుగారి బావమరిదిగాడా?" రేవన్నకి సందేహం వచ్చింది.

తనకు ఇంతకు మించి వివరాలు తెలీవనీ చెప్పాడు.

"శంభూ, గురువు గారి భార్య ఎలా వున్నరు? ఎంతో అభిమానంగా మమ్మల్ని చూసేది. ఇంతకీ గురువుగార్ని ఎవరు చంపారో తెలిసిందా?" ప్రశ్న సంధించింది నేహల.

హఠాత్తుగా వచ్చిన ప్రశ్ని చూసి గతుక్కుమన్నాడు శంభుడు. ఒక్కసారి రేవన్న కేసి చూసాడు. రేవన్న కానీ తన గురించి చెప్పాడాన్న అనుమానం వచ్చింది.

"అతనికెలా తెలుస్తుంది. బహుశా రాజుగారి బావామరిది గాడే చంపించుంటాడు," రేవన్న నేహలతో అన్నాడు.

అతని మాటలు విని "హమ్మయ్యా" అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాడు శంభుడు.

భోజనాలయ్యాక మసూంణ వచ్చాడు. వస్తూనే ఫిరోజ్ణషా వెనక్కి వస్తున్నట్లు చెప్పాడు. ఫిరోజ్‌షా పెళ్ళి కానుకగా వేల కొద్దీ వరహాలూ, బంగారు భరణాలూ వంటివిచ్చారనీ చెబుతూ, సంధి ఒప్పందంలో రాయచూరు గుల్బర్గా సుల్తానులకే చెందుతుందన్న అంశం చెప్పాడు.

"రాయచూరు కనుక గుల్బర్గా వశమయితే, మీరు ముద్గల్ నుండి ఇక్కడికి మకాం మార్చేసుకోండి. అయినా ఇంత గొడవా, యుద్ధమూ జరిగాక దేవరాయలకి నీ మీద కోపం ఇంకా ఉంటుందని అనుకోను. కాకపోతే పరిస్థితులు కాస్త సద్దు మణిగే వరకూ మనం ఓపిక పట్టాలి," అంటూ మసూం చెప్పాడు.

"ఇంకో విషయం, ఆ సైనికులు మీ ఇంటి ముందునుండి వెళ్ళేవరకూ మీరు ముద్గల్ వెళ్ళడం క్షేమం కాదు. ఇది మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. మీ కొచ్చిన ఇబ్బందేవీ లేదు. ఇక్కడా హాయిగా ఉండచ్చు," మసూం చెప్పాడు.

"ఇప్పటికే గత మూణ్ణాళ్లుగా ఇక్కడ తిష్ట వేసాం. ఇంకా ఎన్నాళ్ళిలా చెప్పు?" నేహాలే అంది.

"చెల్లెమ్మా! ఎన్నాళ్ళయినా ఉండచ్చు. ఇది నీ పుట్టిల్లే అనుకో! నీ పెళ్ళికి తమ్ముడి కట్నంగా ఒకటికి పదిరెట్లు రాబట్టుకుంటానులే!" నవ్వుతూ అన్నాడు మసూం.

"తప్పకుండా. చెల్లెమ్మా అని పిలిచావు చూడు. దానికోసమయినా ఇవ్వాలి. పదిరెట్లు కాదు. ఎంత ఇచ్చినా నీ రుణం తీర్చుకోలేను," గద్గద స్వరంతో అంది నేహల.

ఇహ ఆ చర్చని ఎవరూ పొడిగించలేదు. ఫిరోజ్‌షా వచ్చాక మరిన్ని విషయాలు తెలుస్తాయనీ, ఇంకో వారాం ఓపిక పట్టాలని మాత్రం చెప్పాడు.

కొంతసేపు పిచ్చపాటీ మాట్లాడుకున్నాక అందరూ కాసేపు నడుం వాల్చారు.

000000000000

గుల్బర్గా సుల్తానులు నెగొంది విడిచిపెట్టి వెళ్ళరని తెలుసుకున్నాక కాస్త ఊపిరి పీల్చుకున్నాడు దేవరాయలు. ఈ మాణ్ణాళ్లూ ఎంత దుర్భరంగా గడిచిందో అతనికి తెలుసు. బ్రతికి బట్టకడతానన్న ఆశయితే మాత్రం ఎప్పుడూ కలగలేదు. ఫిరోజ్‌షా గాయపడడమే తనకి కలిసొచ్చింది. లేదంటే తనని చంపేసుండేవారు. విజయనగరం మరో మారణహోమానికి గురయ్యేది. తన పరాక్రమం ముందూ, సైన్యం ముందూ గుల్బర్గా సుల్తానులు తాళలేరన్న అహంకారం అతనుకుంది. తను తలచుకుంటే వాళ్ళని సమూలంగా మట్టుపెట్టగలడు. కానీ యుద్ధం చెయ్యడం వల్ల వచ్చే లాభాలు కంటే నష్టాలే ఎక్కువ. ఇందులో ఎక్కువగా నష్టపోయేది ప్రజలే! అందువల్లే గతంలో రాయచూరు వద్ద దాడి చేసినా తను ఎంతో సామర్థ్యంతో తిప్పి కొట్టగలిగాడు.

కానీ ఈ సారి ఫిరోజ్‌షా సైన్యం ఇంతవరకూ, అంటే ఆనెగొంది వరకూ ఎలా రాగలిగారాన్నది మాత్రం అతని మిందుగుడు పడడం లేదు. చారులూ, వేగులూ ఏవయ్యారు? అన్నిటికంటా ఆశ్చర్యకరమయిన సంగతేవిటంటే ఫిరోజ్‌షా సైన్యం గంగావతి వచ్చే వరకూ తనకే కబురూ అందలేదు. ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో మాత్రం అర్థం కాలేదు. మంత్రులందర్నీ పిలిచి ఈ విషయం – ఆరా తీద్దామనుకున్నాడు కానీ, అతనికి ఫిరోజ్‌షా తిరిగి వెళ్ళడమే అత్యంత ప్రాధాన్య విషయం. అందుకే దాని మీద అంతగా చర్చించ లేదు. ఇప్పుడు అంతా సద్దు మణిగాక అతను తన అంతరంగికులని సమావేశ పరిచాడు.

"ఇప్పటికీ అర్థంకాని విషయం ఏవిటంటే, మన వేగులెవరూ ఫిరోజ్‌షా దాడిని పసిగట్ట లేకపోవడం. మన అధికారులూ, సైన్యమూ ఏం చేస్తున్నాయి? ఎక్కడ తప్పిదం జరిగింది? ఎందుకీ విషయంలో అలసత్వం చూపించారు?" అంటూ అందరిపైనా మండి పడ్డాడు.

"మాకెవ్వరికీ ఫిరోజ్‌షా దాడి గురించి వార్త లేదు. ముద్గల్లో మన సైన్యం వెళ్ళిందన్న వార్త తెలిసి గుల్బర్గా వాళ్ళు మనం యుద్ధానికి సన్నాహాలు చేస్తున్నామని అనుకున్నారట. పైగా మన సైన్యం ముద్గల్లో చేసిన బీభత్సానికి చాలామంది భయపడి ఊరు విడిచి పారిపోయారని చెప్పారు. బహుశా ఇవన్నీ చూసి మనం యుద్ధం చెయ్యడానికి సన్నిద్ధులమవుతున్నామని పొరబడి ఉండచ్చు," అక్కడున్న ఒక మంత్రి చెప్పాడు.

"ముద్గల్లో మన సైన్యం బీభత్సం చేసారా? ఇవేమీ నాకు తెలియలేదేవిటి?" చికాకుగా మండిపడ్డాడు దేవరాయలు.

"అప్పటికే మీరు ఆనెగొందిలో ఉన్నారు. మీకు అన్ని విషయాలు స్వయంగా చెప్తానని మీ బావమరిది నరేంద్ర గజపతి చెప్పారు. అందువల్ల మేమూ ఈ విషయం రెట్టించలేదు," మంత్రి చెప్పాడు.

"ఇంతకీ  అమ్మాయి నేహల  ఏమయ్యింది? ఉందా? చచ్చిందా?" కోపంగా అడిగాడు.

"ఆ అమ్మాయి పారిపోయిందని మాత్రం విన్నాము. ఎక్కడికెళ్ళిందో తెలీదు. మీకు తెలిసే ఉంటుంది ఆస్థాన పురోహిత గురువులు వేదరాయశర్మని ఎవరో హత్య చేసారని చెప్పారు!"

"వేదరాయశర్మగారి మరణం గురించి విన్నాను. కానీ అది హత్య అన్న విషయం తెలియదు. ఆయన చాలా మంచి మనిషి. సదా ఈ విజయనగర క్షేమాన్నే ఆశించారు. అసలు ముద్గల్లో ఏం జరిగింది?  నరేంద్రగజపతిని అక్కడ ఏం నిర్వాకం చేసాడో? ముందు అతన్ని రమ్మనమని కబురంపండి. అంతా పెంట పెంట చేసాడు," దేవరాయలు గట్టిగా అన్నాడు.

ఒక అంతరంగికుడు నరేంద్ర గజపతిని తోడ్కొని రావడానికి వెళ్ళాడు.

"ఇదంతా సరే! అసలా ఫిరోజ్‌షా సైన్యం దేవరసుగుర్ ఎలా దాట గలిగారు? రాయచూరు ఎలా రాగలిగారు. అదే కాదు, గంగావతి వరకూ ఏ అడ్డూ లెకుండా ఎలా రాగలిగారు? మన సైన్యం ఏం చేస్తోంది?"

"మహారాజా, మన సైన్య మేలుకొనె లోపునే శత్రు సేనలు వచ్చేసాయి. వాళ్ళు తెలివిగా ముందు గ్రామ ప్రజల్ని భయపెట్టారు. మన సైన్యం ఎక్కడు ఎదురు తిరిగితే వాళ్ళ ప్రాణాలకి ప్రమాదమోనన్న మీమాంసతో మనవాళ్ళు వెనుకంజ వేసారు. అప్పటికే - లస్యమయిపోయింది. అయినా అంతా సజావుగానే సాగింది కదా, మహారాజా?" మంత్రి అన్నాడు.

"చావు తప్పి కన్నులొట్టపోయినట్లయ్యింది.  ఫిరోజ్‌షా కనుక గాయపడకపోయింటే, ఏదైనా జరుగుండేది. అంతా మన విరూపాక్ష స్వామి కటాక్షం. జరిగిందేదో జరిగింది. ప్రధాన పట్టణాల్లో మన సైన్యం సంఖ్యను పెంచాలి. కొత్తగా సైనికుల ఉద్యోగాలకి ఏర్పాటు చెయ్యండి. వారికి ఎక్కువ జీతాలిస్తామని కూడా చెప్పండి. మనం రాయచూరుని మాత్రం ఎలాగయినా మన అదుపులోకి తెచ్చుకోవాలి. ఇవాళకాకపోతే రేపయినా ఈ ముప్పు తప్పదు," దేవరాయలు ఆదేశించాడు.

ఇంతలో నరేంద్రగజపతి కోసం వెళ్ళిన అంతరంగీకుడు తిరిగొచ్చాడు.

"మహారాజా! నరేంద్ర గజతి ఇక్కడ లేరు. రాయచూరు వెళ్ళరని తెలిసింది," చెప్పడా అంతరంగీకుడు.

"రాయచూరా? మాకు చెప్పకుండా...?" ఆశ్చర్యపోయాడు దేవరాయలు.

"మన మహారాణి ఉమాదేవి గారికి కూడా తెలియదని విన్నాం," మళ్ళా అతనే చెప్పాడు.

"రాయచూరులో అతనిక్ పనేవిటి? ఎందుకయినా మంచింది. మనన వేగుల్నీ అప్రమత్త పరచండి. ఎక్కడకనబడ్డా అతన్ని బంధించి తీసుకు రమ్మనమని మా ఆజ్ఞగా చెప్పండి," అంటూ ఆదేశించాడు.

నరేంద్ర జగపతి ఎందుకు రాయచూరు వెళ్ళాడో ఎవరికీ అర్థం కాలేదు.

0000000

ఫిరోజ్‌షా క్షేమంగా తిరిగొస్తాడన్న వార్త తెలిసినప్పటినుండీ అహ్మద్‌ఖాన్‌కి కంటి మీద కునుకు లేదు. ఇన్నాళ్ళూ ఫిరోజ్‌షా లేకపోవడం అతని బాగానే లాభించింది. మొత్తం రాజ్య పాలన మీద పట్టు సాధించాడు. దాదాపు తనే సుల్తానన్నట్లు వ్యవహరించాడు గత మూణ్ణెల్లుగా. అన్నగారు  విజయనగరంలోనే ప్రాణాలు కోల్పోతాడని ఆశించాడు. దేవరాయలు బందీగా ఫిరోజ్‌షాకి చిక్కడంతో కథ అడ్డంతిరిగింది. అతనికి ఈ సంధి ఒప్పందం గురించి ఏ మాత్రమూ తెలీదు. గిసుదరాజు ఫిరోజ్‌షా తీవ్రంగా గాయపడ్డ విషయం కూడా ఎంతో గోప్యంగా ఉంచాడు.

అహ్మద్‌ఖానుకి అన్నగారి గురించిన వివరాలు చాలా కుప్తంగా తెలుస్తున్నాయి. సంధి ఒడంబడిక విషయం మాత్రం గిసుదరాజు కబురంపాడు. దానిలో భాగంగానే ఫిరోజ్‌షా పెళ్ళి జరిగిందన్న విషయం విని ఆశ్చర్యపోయాడు. ఇన్నాళ్ళూ ఎన్నో యుద్ధాలూ, సంధి ఒప్పందాలూ చూసాడు కానీ ఇటువంటిది ఎప్పుడూ చాళ్ళేదు. ఏదో తేడా జరిగుంటుందని మాత్రం గ్రహించాడు. అన్నగారు వస్తే ఇప్పుడున్న అధికారమూ, హోదా పోతాయి. ఈసారి ఎలాగయినా ఈ అవకాశం వదలుకోకూడదు. అన్నగార్ని హతమార్చయినా తను సింహాసనం ఎక్కాలి. మంత్రులనీ, అధికారులందర్నీ సమావేశ పరిచాడు. ఫిరోజ్‌షా వస్తున్న వార్త చెప్పాడు. పైకి మాత్రం ఎంతో సంతోషం ప్రకటిస్తున్నా లోలోపల అతలాకుతలమయిపోతున్నాడు. అసలు వాళ్ళు గుల్బర్గా రాకుండానే అన్నగారిని హతమారిస్తే అన్న లోచన కూడా వచ్చింది. అన్నగారిని హతమార్చి అది దేవరాయల మీద నెట్టేయచ్చనుకున్నాడు. దేవరాయల మనుషులు ఫిరోజ్‌షాతో ఉన్న వేలాది సైనికుల కళ్ళు గప్పి వెళ్ళలేరు. పైగా గిసుదరాజు కూడా ఫిరోజ్‌షాతో ఉన్నాడు. ఇందులో ఏ మాత్రం తేడా వచ్చినా తన మీద అనవసరంగా లేనిపోని అనుమానాలొస్తాయి. సరే అన్నగారొచ్చాకనే భవిష్యత్తు నిర్ణయించుకోవచ్చని అనుకున్నాడు.

ఫిరోజ్‌షా మీద మాత్రం నిఘా వేయమని తన అంతరంగీకులకి చెప్పాడు.

మూడు నాళ్ళ తరువాత ఫిరోజ్‌షా, గిసుదరాజ్ గుల్బర్గా చేరుకున్నారు. వాళ్ళని చూసే వరకూ అహ్మద్‌ఖానుకి తెలీదు, ఫిరోజ్‌షా అక్కడ తీవ్రంగా గాయపడ్డాడని. ఫిరోజ్‌షా రాకతో గుల్బర్గా కోటలో సంతోషం వెల్లివిరిసింది. అన్నగారు కాస్త తిరిగ గలిగినా, మునపటి శక్తి లేదనీ, గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయని వైద్యుల ద్వారా తెలుసుకున్నాడు అహ్మద్‌ఖాన్.

అన్నగారు పూర్తిగా కోలుకొని మరలా యథా ప్రత్కారం రాజ్య సంబంధిత వ్యవహారాలు చూడ్డానికి కనీసం ఆరు నెలలు పట్టచ్చనీ గ్రహించాడు. ఈలోగా తను గిసుదరాజుని మంచి చేసుకుని ఏదో విధంగా గద్దెని ఆక్రమించుకోవాలన్నది అతని ఆశ.

అతనికి ఇప్పుడు చాలా మార్గాలు కనిపిస్తున్నాయి.

చాలా పావులు కళ్ళముందే ఉన్నాయి.

అందులో అతి పెద్ద తిరుగులేని ఆయుధం కొత్త సుల్తానా మంజరి.

*00000000000*

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

**Click here to share your comments on this serial**